# ★ ప్రేమాన్వేషణ ★

రచన: రతన్

ఎవడో ఓ అభాగ్యుడు అదేపనిగా తిరుగుతున్నాడు. అతని గుడ్డలు చినిగి పోయాయి, తల వెంట్రుకలు అట్టలుగట్టి వున్నయి అతని ముఖంలో నిరాశ కండ్లలో, దైన్యము కనిపిస్తున్నయి. పిచ్చివానిలా దేనినో వెతుక్కుంటూ వాసవాడలా గాలిస్తూన్నాడు. దారినిపోయే ప్రతి ఒక్కరినీ నిలదీసి అడుగుతున్నాడు "ప్రేమంటే ఏమిటి ?"

వీధిలో యిద్దరు చిన్నపిల్లలు బొమ్మలతో ఆడుకుంటున్నారు. వారిని సమీపించి అదేప్రశ్న వేశాడు. "ప్రేమంటే ఏమిటమ్మా?" ఇద్దరు అతనినిచూచి పగులబడినవ్వి "అంతమాత్రం తెలీదానీకు. మాకుబాగా తెలుసు" అన్నారు. అతడు ఆత్రుతతో వారివైపుచూస్తూ "ఏది తెలిస్తే చెప్పండి" అన్నాడు ఆవేశంగా. ఒకపిల్లవాడు వెంటనే "ప్రేమఅంటే మా అమ్మ" అన్నాడు మరోడు "ప్రేమఅంటే మా నాన్న" అని అందుకున్నాడు. ఇదివింటూనే కోపముతో వారిని యిసుకలోత్రోసి చక్కాపోయాడు తిరిగైనా చూడకుండా

చంకన కడవ పెట్టుకొని నెత్తిన ముసుగేసుకొని వయ్యారంగా బావికి పోతూంది పెద్దింటి కొత్తకోడలు. అంతవేగంగా పోయేవాడల్లా ఆమెనచూసి రకీమని ఆగిపోయాడు. "ప్రేమంటే ఏమిటి?" ఆమెను అదేప్రశ్న వేశాడు ఆమె తల సిగ్గుతో వంగిపోయింది. జవాబు చెప్పందే దారినుంచి కదిలేట్టు లేడు. తనకాలిగోళ్ళ గోరింట ఎరుపు రంగును చూస్తూ చిరునవ్వుతో చెప్పింది. "ప్రేమఅంటే నాభర్త" అని యింకా ఏదో చెప్పబోయింది. ఆతృతగా చూచేవాడల్లా కోపముతో భూమిని కాలితో గట్టిగా తన్ని ఏదో గొణుక్కుంటూ చక్కాపోయాడు

ఓ గుడ్డివాడు భిక్షం అడుక్కుంటూ చేతికర్రతో భూమిని తాళంలా కొడుతూ ఎడమచేతితో గాలిలో వెతుక్కుంటూ పోతున్నాడు తొందరగా పోయేవాడల్లా ఆగి "ప్రేమంటే ఏమిటి?" అని అడిగాడు. "ఆదాబాబూ! ఇంతప్రపంచంలో ఎవరూ చెప్పలా? నాదగ్గరకొచ్చావే!" అన్నాడు "లేదుతాతా నీకు తెలిసుంటే చెబుదూ పుణ్యముంటుంది" అని ముసలివాని నోటినుండి ఏమొస్తోందో వినడానికి కుతూహలంగా చెవులు నిక్కించుకొని చూస్తున్నాడు- "అదేముంది బాబూ ప్రేమఅంటే మీలాంటి ధర్మాత్ములు మామీద చూపేదేగా!" అన్నాడు- కోపంతో జుట్టు పీక్కుంటూ కాలి కొద్ది దౌడు తీశాడు యిది వింటూనే-

ఒక నవయువ్వనుడు విలాసంగా నోటినిండా కిళ్లీ వేసుకొని సిగరెట్టు పీలుస్తూ పోతున్నాడు- అతని సిల్కులాల్చీనుంచి సెంటువాసన గుప్పున కొడుతూంది- అతనిని చూస్తూనే ఆగిపోయి "క్షమించి ఒకవిషయ మడుగుతాను- దయచేసి తెలియచేస్తారా" అన్నాడు "త్వరగా కానియ్యి అవసరంగా పోవాలి" అన్నాడు అవతలేదో కొంపలు తగులబడేటంత పని వున్నట్లు- "ప్రేమ అంటే ఏమిటి?" అదే ధోరణి- యువకుడు ఫక్కున నవ్వాడు- "పిచ్చివాడా! అదా నీ అనుమానం యింకేదో ప్రాణంపోయేటంత సంగతి అడుగుతావనుకున్నాను" అన్నాడు ధీమాగా- "మీకు తెలిసినట్టుంది- త్వరగా చెబుదురూ" అని బ్రతిమాలాడు- "ప్రేమను చూడాలనివుంటే నాతో రా యిప్పుడే చూపిస్తాను" అన్నాడు- "ఎక్కడికి రమ్మంటారు" ఆశతో అడిగాడు. "యింకెక్కడికి? వేశ్యాగృహానికి ప్రేమంటే యింకేమనుకొన్నావు" శాంతంగా వింటున్నవాడల్లా చివ్వాలున లేచి పోయాడు. కోపంతో అతని వళ్ళంతా వేడెక్కింది. పిచ్చిజాస్తి అయినట్టుంది. జుట్టు పీక్కుంటూ గుండెలు పగిలేట్టు "ప్రేమంటే ఏమిటి?" అని అరుచుకుంటూ సముద్రతీరంలో యిసుకమీద పరిగెత్తుతున్నాడు బ్రహ్మాండం బ్రద్దలయ్యేట్టు ఆకాశంలో ఓ పెద్ద శబ్దమయి కండ్లు మిరిమిట్లు గొలిపే ఓ కాంతి తళుక్కున మెరిసింది. పిచ్చివాడు స్పృహతప్పి యిసుకలో నిలువునా కూలబడి పోయాడు. ఆకాశంనుంచి యిలా వినిపించింది. "ప్రేమే దైవము—దైవమే ప్రేమ."